

ఆక్రమణల తొలగింపు

తెనాలిఅర్బన్: బుర్రిపాలెం రోడ్డులో ఆక్రమణల తొలగింపు ప్రక్రియ శనివారం కొనసాగింది. పనులను మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న, ఏసీపీలు సుధాకర్, సుబ్బారావు పరిశీలించారు.



సీడ్స్ కంపెనీ తనిఖీ

ఫిరంగిపురం: అమీనాబాద్ గ్రామపరిధిలోని తులసీ సీడ్స్ కంపెనీని శనివారం కోనసీమ వ్యవసాయ సహాయ సంచాలకుడు నాగేశ్వరరావు, విజిలెన్స్ సీఐ మాణిక్యరావు తనిఖీ చేశారు.

వేంకటేశ్వరునికి తులసీదళార్చన



అమరావతి: మండలపరిధిలోని మల్లాది గ్రామంలో వేంచేసియున్న వటవృక్షాం తర్గత వెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం తులసీ దళార్చన, శాంతి కల్యాణం నిర్వహించారు.

చీరాలలో కొండంత అవినీతి

సాక్షి ప్రతినిధి, బాపట్ల: కూటమి అధికారంలోకి వచ్చి పట్టుమని నెల తిరక్కుండానే చీరాల ముఖ్య నేత అవినీతి కొండను తలపిస్తోంది. ఇదే విషయంపై నియోజకవర్గంలో జోరుగా చర్చ సాగుతోంది. ఈయనగారి అవినీతి దందా వ్యవహారం ఇప్పటికే టీడీపీ అధిష్టానానికి సైతం ఎగబాకినట్లు రాజధాని కేంద్రంలో గుసగుసలు వినిపిస్తున్నాయి. తాజాగా చీరాల సముద్ర తీరంలోని రిసార్టుల్లో అక్రమ వసూళ్ల వ్యవహారం తెరపైకి వచ్చింది. ఇరవై రోజుల కిందట చీరాల సముద్ర తీరంలో రెండు రోజుల వ్యవధిలో ఎనిమిది మంది పర్యాటకులు నీట మునిగి చనిపోయారు. భద్రతా లోపంవల్లే మరణాలు సంభవించాయన్న ఆరోపణలు వచ్చాయి. తీరంలో భద్రత ఏర్పాటు చేసి పర్యాటకులు ప్రమాదాల బారిన పడకుండా చూడాల్సిన ప్రభుత్వం దాన్ని విస్మరించింది. తీరానికి పర్యాటకులు రాకుండా నిషేధం విధించింది. కొంత కాలం పాటు దీన్ని అమలు పరుస్తున్నట్లు ప్రకటించడంతో రిసార్టులు, లాడ్జీలు వెలవెలబోతున్నాయి.

కాసులు కురిపిస్తున్న ప్రభుత్వ నిర్ణయం

చీరాల ముఖ్యనేతకు ప్రభుత్వ నిర్ణయం కాసులు కురిపించే వనరుగా మారింది. తిరిగి రిసార్టులను తెరిపించాలంటే ఒక్కో రూముకు వారానికి రూ. వెయ్యి చొప్పున ముఖ్యనేతకు కప్పం చెల్లించాలని ఆయన తరఫున అన్ని వ్యవహారాలు చక్కబెడుతున్న ఓ కానిస్టేబుల్ డిమాండ్ చేశారు. అంత మొత్తంలో ఇచ్చుకోలేమని , కాస్త రేటు తగ్గించాలని పలువురు రిసార్టుల యజమానులు మొరపెట్టుకున్నా సదరు కానిస్టేబుల్ అంగీకరించలేదు. ఒక్కో రిసార్ట్ రోజుకు డిమాండ్‌ను బట్టి రూ. 10 నుంచి 15 వేలు కూడా వసూలు చేస్తున్నారని, వారానికి వెయ్యి రూపాయలు అంటే చాలా తక్కువ మొత్తమని సదరు కానిస్టేబుల్ ముఖ్యనేత మాటగా తేల్చి చెప్పాడు. డబ్బులు ముట్టజెపితే తీరంలో ప్రమాదాలు లేదా రిసార్టుల్లో అక్రమ కార్యకలాపాలు జరిగినా చూసీ చూడనట్లు వ్యవహరిస్తామని లేదంటే తెరిపించేది లేదని బెదిరించినట్లు సమాచారం. దీంతో కోట్లు వెచ్చించి రిసార్టులు, లాడ్జీలు నిర్మించినందున వాటిని మూసివేయడంకంటే ముఖ్యనేత అడిగిన కాడికి కప్పంచెల్లించడమే ఉత్తమమని యజమానులు అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది.

వసూల్ రాజా దందా

- రూముకు వెయ్యిస్తే రిసార్ట్‌లు తెరిపిస్తా
- యజమానులకు ముఖ్యనేత బంపరాఫర్
- రిసార్ట్ ఓనర్లను ఒప్పించిన కానిస్టేబుల్
- చీరాల రిసార్ట్‌లు, లాడ్జీల పరిధిలో 600 రూములు
- నెలకు రూ. 24 లక్షల రాబడి
- రియల్ వెంచర్ల వద్దా వసూళ్ల పర్వం
- రేషన్ బియ్యానికి నెలకు రూ. 13 లక్షలు
- రెండు రోజుల కిందట కుదిరిన ఒప్పందం
- ముఖ్యనేత దోపిడీపై సర్వత్రా చర్చ



ఏడాదికి రూ. 2.88 కోట్లు రాబడి

చీరాల పరిధిలో 30కి పైగా భారీ రిసార్ట్‌లు, 20కి పైగా లాడ్జీలు ఉన్నాయి. వీటి పరిధిలో 600 వరకూ రూములున్నాయి. వారానికి ఒక్కో రూముకు రూ. వెయ్యి చొప్పున నెలకు రూ. 24లక్షలు వస్తుంది. ఈ లెక్కన ఏడాదికి రూ. 2.88 కోట్లు రాబడి ఉంటుంది.

బియ్యం అక్రమ తరలింపులో రూ. 13 లక్షలు డీల్

చీరాల నియోజకవర్గం నుంచి పేదల బియ్యాన్ని అక్రమంగా తరలించుకొనేందుకు ముఖ్యనేతకు నెలకు రూ. 13 లక్షలు ఇచ్చేలా ఒప్పందం కుదిరింది. తొలుత ముఖ్యనేత అనుచరుడిగా ఉన్న కానిస్టేబుల్ నెలకు రూ. 16 లక్షలు చెల్లించాలని పట్టుబట్టినట్లు సమాచారం. ఆ తర్వాత కొందరు మధ్యవర్తులు జోక్యం చేసుకొని చివరకు నెలకు రూ. 13 లక్షలు చెల్లించేలా ఒప్పందం చేసుకున్నారు. రెండు రోజుల క్రితమే ఇది ఖరారైనట్లు తెలుస్తోంది. చీరాల నియోజకవర్గంతో పాటు అటు పర్చూరు, బాపట్ల ప్రాంతంలోని బియ్యాన్ని సైతం వ్యాపారులు అక్రమంగా చీరాలకు తరలించి వాటిని ఇతర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు. దీంతో ఇక్కడ అక్రమ బియ్యం వ్యాపారానికి మంచి డిమాండ్ ఉండటంతో అధికార పార్టీ నేతకు పెద్ద మొత్తంలోనే బేరం కుదిరింది.



నిషేధంతో నిర్మానుష్యంగా మారిన తీరంలోని రిసార్ట్

‘రియల్’గా అక్రమార్జన



చీరాల పరిసర ప్రాంతంలో వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్

రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ఆరితేరిన చీరాల ముఖ్యనేత అధికారాన్ని అడ్డుపెట్టి ఆ విభాగంలోనూ కాసులు కురిపించే పనిలో పడ్డారు. చీరాల ప్రాంతంలో వెలసిన రియల్ వెంచర్ల నుంచి అందిన కాడికి దండుకుంటున్నట్లు ప్రచారం సాగుతోంది. కొన్ని వెంచర్ల వద్ద ఎకరానికి రూ. 15 లక్షల వరకూ వసూలు చేస్తుండగా, కొన్ని ప్రధాన వెంచర్లవద్ద ఇల్లు కట్టుకునేందుకు స్థలం ఇవ్వాలంటూ సరికొత్త పద్ధతిలో వసూళ్లకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. ఇటీవల చీరాల పట్టణ పరిధిలోని ఒంగోలు–మచిలీపట్నం ప్రధాన రహదారిలో చీరాల పట్టణానికి చెందిన వ్యక్తి దాదాపు నాలుగు ఎకరాల్లో వెంచర్ వేశారు. రోడ్డుకు ఆనుకుని ఉన్న 35 సెంట్లు ఇవ్వాలని, ఇందులో ఇల్లు కట్టుకుంటానని సదరు ముఖ్యనేత డిమాండ్ చేసినట్లు సమాచారం. మాజీ కేంద్రమంత్రి, రాజమండ్రి ఎంపీ పురందేశ్వరికి అనుచరుడుగా ఉన్న సదరు రియల్ వ్యాపారి ఇదే విషయం ఆమెతో పాటు పలువురు నేతలకు చెప్పారు. దీంతో పురందేశ్వరి విషయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు, లోకేష్‌ల దృష్టికి తెచ్చినట్లు అధికార పార్టీ నేతలు చర్చించుకుంటున్నారు. రియల్టర్లందరూ తనను కలవాలని, తనకు తెలియకుండా రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు ఎక్కడా కొలతలు వేయడం చేయకూడదని ముఖ్యనేత ఆర్డీవోతో పాటు చీరాల, వేటపాలెం తహసీల్దార్లు, ల్యాండ్స్ అండ్ సర్వే ఏడీని సైతం ఆదేశించినట్లు తెలుస్తోంది. సదరు నేత అక్రమ దందా మొత్తం వ్యవహారాల్ని వివాదాస్పద వ్యక్తిగా పేరుపొందిన కానిస్టేబుల్ పర్యవేక్షించడం గమనార్హం. ఎన్నికల సమయంలో అతడ్ని అధికారులు సస్పెండ్ చేయగా ఇటీవల ముఖ్యనేత అధికారాన్ని అడ్డుపెట్టి తిరిగి పోస్టింగ్ ఇప్పించారు. అయితే, తాజాగా సదరు కానిస్టేబుల్ చీరాల పట్టణంలో తన ఫొటోతో అధికారపార్టీ నేతల ఫ్లెక్సీలు వేయించి మరో మారు హల్‌చల్ సృష్టించడంతో శుక్రవారం మరోమారు ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. మొత్తంగా చీరాల ముఖ్యనేత అవినీతి దందా జిల్లాలో ఇప్పుడు హాట్‌టాపిక్‌గా మారింది.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మరో వెంచర్

న్యూస్‌రీల్

ఆర్టీసీ బస్సుకు తప్పిన పెను ప్రమాదం



కారంచేడు: నరసరావుపేట నుంచి చీరాల వస్తున్న చీరాల డిపోకి చెందిన ఆర్టీసీ బస్సు శనివారం రాత్రి ప్రమాదానికి గురయ్యింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడక పోయినప్పటికీ పెను ప్రమాదం తప్పిందని ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. స్థానికుల వివరాల మేరకు.. పర్చూరు–కారంచేడు మధ్య రామానాయుడు వంతెన సమీపంలో మొండి కాలువ దగ్గర ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో ఆర్టీసీ బస్సు వంతెనను ఢీకొట్టింది. ఈ ప్రమాద సమయంలో సుమారు 25 మంది ప్రయాణికులున్నట్లు సమాచారం. బస్సు మరింత అదుపు తప్పితే పక్కనే ఉన్న రొంపేరు (పర్చూరు వాగులో) పడి ప్రాణనష్టం జరిగి ఉండేదని ప్రయాణికులు చెబుతున్నారు. డ్రైవర్ చాకచక్యంగా నడిపి ప్రమాద తీవ్రతను తగ్గించగలిగారని తెలిపారు.

రిటైర్డు ఈఈపై అట్రాసిటీ కేసు నమోదు

చీరాల: రిటైర్డు ఈఈపై శనివారం చీరాల టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదైంది. టూటౌన్ పోలీసుల వివరాల మేరకు.. బాపట్ల రైలుపేటకు చెందిన హెప్సిబా భర్త పదేళ్ల కిందట మరణించాడు. కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తోంది. వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల్ని చూసుకునే వారు లేక గత రెండు సంవత్సరాలుగా చీరాలలోని థామస్‌పేటలో వారి వద్దే ఉంటోంది. బతుకుదెరువుతో పాటు తల్లిదండ్రుల్ని పోషించుకునేందుకు ఏదైనా పని చూపించాలని కోరుతూ ఈనెల 4న ఎమ్మెల్యే కార్యాలయానికి హెప్సిబా వెళ్లింది. ఈ క్రమంలో అక్కడే ఉన్న రిటైర్డు ఈఈ నక్కల వెంకటరమణ తానే ఇక్కడ అంతా చూసుకుంటానని.. పని ఇప్పిస్తాను.. నా సంగతి చూస్తావా ? అంటూ అసభ్యకరంగా మాట్లాడాడు. పని కోసం వస్తే అలుసుగా తీసుకుని అసభ్యంగా మాట్లాడడం సరికాదని చెప్పడంతో కోపంతో అతడు కులం పేరుతో దూషించాడు. అక్కడే ఉన్న వారు కూడా ఇదేంటని ప్రశ్నించారని, ఈ విషయం బయట చెబితే తల్లిదండ్రుల్ని బతకనియ్యనని బెదిరించాడని ఫిర్యాదులో హెప్సిబా పేర్కొన్నట్లు పోలీసులు తెలిపారు.. బాధితురాలి ఫిర్యాదు మేరకు రిటైర్డు ఈఈపై అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు శనివారం పేర్కొన్నారు. ఈ క్రమంలో అక్కడ వెంకటరమణ దూషిస్తూ ఉండగా ఈపూరుపాలేనికి చెందిన కొమ్మనబోయిన రజని అడ్డుకోబోయింది. దీంతో తనను కూడా కొట్టాడంటూ ఆమె శనివారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది.

193 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం



క్రోసూరు: మండలంలోని నాగవరం గ్రామం వద్ద శనివారం తెల్లవారుజామున 193 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఎస్‌ఐ ఎం.షఫీ తెలిపిన వివరాలు...అచ్చంపేట మండలం చిగురుపాడు గ్రామానికి చెందిన పోలిశెట్టి చెంచయ్య వద్ద ఉన్న రేషన్ బియ్యాన్ని నకరికల్లు గ్రామానికి చెందిన వెంగళరావుకు లారీలో తరలిస్తున్నాడు. ముందస్తు అందిన సమాచారం మేరకు పోలీసులు నాగవరం గ్రామం వద్ద వాహనాన్ని ఆపి తనిఖీ చేశారు. లారీలో 9930 కిలోల రేషన్ బియ్యం ఉన్నట్లు గుర్తించారు. లారీ స్వాధీనం చేసుకుని డ్రైవర్, క్లీనర్, విక్రయదారుడు, కొనుగోలుదారులపై కేసు నమోదు చేశారు. బియ్యాన్ని సివిల్ సప్లయీస్ డీటీ షేక్ గఫూర్‌కు అప్పగించారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మాచర్ల రూరల్: నర్సరీలో మొక్కలకు నీరు పెడుతూ ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ తగిలి రైతు మృతి చెందిన సంఘటన మండలంలోని కొత్తపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. వివరాలలోకి వెళితే... గ్రామానికి చెందిన తేళ్లూరి సత్యనారాయణరెడ్డి (40) లక్ష్మీ శ్రీనివాస నర్సరీలో మొక్కలకు నీరు పెట్టేందుకు విద్యుత్ మోటార్ స్విచ్ వేసేందుకు దగ్గరకు వెళ్లి ఆన్ చేశాడు. విద్యుత్ ప్రవహిస్తున్న వైర్లు తగిలి తీవ్రమైన షాక్ తగలడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. అతనికి భార్య, పిల్లలున్నారు. ఈ మేరకు విజయపురిసౌత్ పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజలందరికీ ఉచితంగా ఇసుక పంపిణీ

జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

బాపట్ల: ఉచిత ఇసుక విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి ప్రకటించారు. ఇసుక నూతన విధానంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం శనివారం స్థానిక తన చాంబర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఇబ్బందులు పడకుండా నూతన విధానానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని తెలిపారు. జీసీకేఎస్ ఏజెన్సీల నుంచి ఇసుక స్టాక్ పాయింట్లను స్వాధీనం చేసుకోవాలని ఆర్డీవోలు, తహసీల్దార్లను ఆదేశించారు. ప్రజలు స్వేచ్ఛగా ఇసుక తీసుకెళ్లేలా ప్రత్యేక టీములు నియమిస్తామని చెప్పారు.

రేపటి నుంచి పంపిణీ

ప్రజలకు సోమవారం నుంచి ఉదయం 6 గంటల నుంచి ఇసుకను ఉచితంగా ఇవ్వనున్నట్లు కలెక్టర్ చెప్పారు. రేవుల వద్ద వాహనంలోకి ఇసుక లోడింగ్, ప్రయాణ ఖర్చులు మాత్రమే ఉంటాయని స్పష్టం చేశారు. వివరాలను మైన్స్ అండ్ జియాలజీ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు ఉంచామని తెలిపారు. ఇసుక కావాల్సిన వారు ఆధార్, ఇతర ధ్రువీకరణ పత్రాలను చూపి తీసుకోవచ్చని చెప్పారు. జిల్లాలోని ఆరు ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద 72,736 మెట్రిక్ టన్నులు ఇసుక విక్రయానికి సిద్ధంగా ఉందని చెప్పారు. డిజిటల్ పేమెంట్‌కు మాత్రమే అనుమతి ఉంటుందని జిల్లా కలెక్టర్ వెంకట మురళి స్పష్టం చేశారు. ఒక వ్యక్తి రోజులో 20 టన్నులు మాత్రమే తీసుకు వెళ్లడానికి అనుమతిస్తామని తెలిపారు. అక్రమాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. నల్ల బజారులో ఇసుక అక్రమ విక్రయాలు అరికట్టాలని చెప్పారు.

ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయాలి

ఇకనుంచి ఇసుక నిరంతరం అందుబాటులో ఉంటుందనే విషయాన్ని ప్రజలకు తెలపాలన్నారు. స్టాక్ పాయింట్ల వద్ద ఫ్లెక్సీలు, బ్యానర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. సచివాలయం సిబ్బందిలో ఒకరిని స్టాక్ పాయింట్ల వద్ద నియమించాలని ఆదేశించారు. 24 గంటలపాటు పోలీసులు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద వాహనాలలోకి లోడింగ్ చేసినందుకు కేవలం రూ.20 ధరను ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. ప్రస్తుతం బాపట్ల మండలం మార్కెట్ యార్డ్ లోని ఇసుక స్టాక్ పాయింట్‌లో 15,450 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉందని ఆయన తెలిపారు. వేటపాలెం జాతీయ రహదారి వద్ద స్టాక్ పాయింట్‌లో 4,053, అద్దంకి మండలం అనమనమూరు స్టాక్ పాయింట్‌లో 10,374, అద్దంకి తిమ్మాయపాలెం స్టాక్ పాయింట్‌లో 5,103, మార్టూరు స్టాక్ పాయింట్‌లో 2,897, కొల్లూరు మండలం జువ్వలపాలెంలో స్టాక్ పాయింట్‌లో 34,859 మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉందని కలెక్టర్ వివరించారు. ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద దస్త్రాలు పక్కాగా ఉండాలని సూచించారు. వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించాలని తెలిపారు. సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ విఠలేశ్వరరావు, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్. సత్తిబాబు, గనుల శాఖ ఏడీ రాజేష్, డీపీవోలు సురేష్, రవికుమార్, ఆర్డీవోలు, డీఎస్పీలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



ఉచిత ఇసుక విధానంపై సమీక్షిస్తున్న జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి

వంతెనలు, ఊట బావుల వద్ద ఇసుక తవ్వకాలు వద్దు

వివిధ శాఖల అధికారుల సమావేశంలో మంత్రి గొట్టిపాటి

అద్దంకి: గుండ్లకమ్మ వంతెనకు ఇరువైపులా, తాగునీటి ఊట బావుల వద్ద ఇసుక తవ్వకాలు జరపనీయవద్దని పోలీసులకు, మున్సిపల్ శాఖ అధికారులను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. రెండు, మూడు రోజుల్లో ఉచిత ఇసుక పాలసీ మార్గదర్శకాలను సీఎం విడుదల చేయనున్నారని వెల్లడించారు. శనివారం ఆయన పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో వివిధ శాలఖ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. తాగునీరు, పారిశుద్ధ్యం, టిడ్కో ఇళ్లు, విద్యుత్, గృహ నిర్మాణంపై అధికారులతో చర్చించారు. ఆయా శాఖల పరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి చెప్పారు. పట్టణంలో పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా అధ్వానంగా ఉందని, వీటిపై దృష్టి పెట్టాలని మున్సిపల్ అధికారులకు చెప్పారు. తాగునీరు అందని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని ఆదేశించారు. నామ్ రహదారిలో గోపాలపురం, సంతమాగులూరు మండలంలోని ఏల్చూరు గ్రామాల వద్ద రహదారిని పూర్తి చేయకపోతే ప్రమాదాలను అరికట్టడం చాలా కష్టమని చెప్పారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ సత్యనారాయణ, మేనేజర్ శ్రీదేవి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి గొట్టిపాటి

అగ్నివీర్ వాయుసేనలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం

బాపట్ల: అగ్నివీర్ వాయుసేనలో చేరడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భారత వైమానిక దళం నాన్ కమిషన్డ్ ఆఫీసర్ ఎన్. సందీప్ తెలిపారు. అగ్నివీర్ వాయుసేనపై అనుబంధ శాఖల అధికారులతో శనివారం స్థానిక కలెక్టరేట్‌లో ఆయన సమావేశం నిర్వహించారు. భారత సైన్యంలోకి యువకులు చేరడానికి అగ్నివీర్ ద్వారా కేంద్ర ప్రభుత్వం అవకాశం కల్పించిందని ఆయన చెప్పారు. ఈనెల 8వ తేదీ నుంచి 28వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. 2004 జూలై 3 నుంచి 2008 జనవరి 3వ తేదీ మధ్యలో జన్మించిన వారే అర్హులని పేర్కొన్నారు. అక్టోబర్ 18వ తేదీన రాత పరీక్ష ఉంటుందన్నారు. పూర్తి వివరాలు వెబ్ సైట్ లో పొందవచ్చని సూచించారు. బాపట్ల జిల్లాలోని 149 కళాశాలలో యువతకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని చెప్పారు. నాలుగు సంవత్సరాల పాటు సైన్యంలో పనిచేయడం ద్వారా కలిగే ప్రయోజనాల్ని యువతకు వివరించాలని తెలిపారు. సమావేశంలో ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐఓ ఎర్రయ్య, ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారి రాజదిబోరా, కలెక్టరేట్ బీ–సెక్షన్ పర్యవేక్షకులు మల్లీశ్వరి, అనుబంధశాఖల అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న భారత వైమానిక దళం నాన్ కమిషన్డ్ ఆఫీసర్ ఎన్.సందీప్

స్నేహం ముసుగులో డబ్బు కోసం హత్య

- సాంకేతిక పరిజ్ఞానంతో నిందితుడి అరెస్టు
- వివరాలు వెల్లడించిన సీఐ నరసింహారావు

సంతమాగులూరు (అద్దంకి): స్నేహం ముసుగులో ఓ వ్యక్తిని డబ్బు కోసం హత్య చేశాడు ఓ దుర్మార్గుడు. శనివారం సీఐ నరసింహారావు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి నిందితుడి వివరాలు వెల్లడించారు. పల్నాడు జిల్లా వెల్దుర్తి మండలం గంగలకుంట (ప్రస్తుత నివాసం శిరిగిరిపాడు) గ్రామానికి చెందిన మేడబోయిన ఆంజనేయులు (32) గొర్రెల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఇదే జిల్లా నూజెండ్ల మండలం పాతరెడ్డిపాలెం గ్రామానికి చెందిన నిందితుడు రావుపల్లి నాగప్రసాద్‌తో ఆంజనేయులుకు పరిచయం ఏర్పడింది. ఇద్దరూ కలిసి వినుకొండ, చిలకలూరిపేట తదితర ప్రాంతాల్లోని సంతలకు వెళ్లి గొర్రెలను కొనుగోలు చేసి మళ్లీ లాభాలకు విక్రయిస్తుంటారు. దాంతో ఇద్దరూ మంచి స్నేహితులుగా మారారు. అయితే నిందితుడు నాగప్రసాద్ చెడు వ్యసనాలకు బానిస కావడంతో గొర్రెలు అమ్మగా వచ్చిన డబ్బును మంచినీళ్ల వలే ఖర్చు చేసి వ్యసనాల కోసం అప్పులు చేశాడు. ఎలాగైనా స్నేహితుని వద్ద ఉన్న డబ్బు కాజేయాలనే ఉద్దేశంతో ముందుగా వేసుకున్న ప్లాన్ ప్రకారం మార్చి 7న ఆంజనేయులుకు ఫోన్ చేశాడు. గొర్రెల వ్యాపారం ఎక్కువగా చేయడం వల్ల మరింత లాభం వస్తుందని నమ్మబలికాడు. రూ.3 లక్షలు తీసుకుని రావాలని చెప్పాడు. దాంతో తాను డబ్బు తీసుకుని వస్తున్నానని నిందితుడితో ఆంజనేయులు ఫోన్‌లో చెప్పాడు.

సున్నిత అవయవాలపై దాడి చేసి..

వెంటనే నిందితుడు నాగప్రసాద్ పుట్టావారిపాలెం వెళ్లి మృతుడిని బైకుపై ఎక్కించుకని ఇద్దరూ సంతమాగులూరు వెళ్లారు. అక్కడ నాగప్రసాద్ ప్లాన్ ప్రకారం ఆంజనేయులుకి మద్యం తాగించాడు. మళ్లీ మరోచోట మద్యం తాగించి తన బైకుపై సంతమాగులూరు మండలంలోని గురిజేపల్లి గ్రామ కరివేపాకు తోట వద్దకు తీసుకుని వెళ్లి అక్కడ దించాడు. అప్పటికే పూటుగా తాగిన ఆంజనేయులు వెనక్కు పడిపోయాడు. వెంటనే నాగప్రసాద్ బీర్జాలు, పొట్టపై దాడి చేశాడు. మెడకు కట్టుకుని ఉన్న కాశీదారాన్ని గట్టిగా మెలితిప్పడంతో మృతి చెందినట్లు నిర్ధారించుకున్నాడు. తరువాత మృతుడి వద్ద ఉన్న సంచిలోని రూ.2.85 లక్ష, సెల్‌ఫోన్‌ను తీసుకున్నాడు. అందులోని సిమ్ కార్డు తీసేసి స్విచ్ఛాఫ్ చేసి పరారీలో ఉన్నాడు. కరివేపాకు తోటలో గుర్తు తెలియని మృతదేహం ఉందనే సంతమాగులూరు వీఆర్‌వో షేక్ అబ్దుల్ సుభాని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. బంధువులు మృతదేహాన్ని గుర్తించి, నాగప్రసాద్‌పై అనుమానం వ్యక్తం చేశారు. ఆధునిక పరిజ్ఞానం ఉపయోగించి నిందితుడిని పోలీసులు గుర్తించారు. బల్లికురవ మండలంలోని వేమవరం గ్రామం వద్ద అరెసు చేసినట్లు సీఐ తెలిపారు. నాగప్రసాద్‌ను పట్టుకున్న సిబ్బందిని ఆయన అభినందించారు. నిందితుడి వద్ద నుంచి నగదును, సెల్‌ఫోన్, బైకును సీజ్ చేసినట్లు చెప్పారు. సమావేశంలో ఎస్ఐ సురేశ్, సిబ్బంది పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ నరసింహారావు

రాష్ట్ర ప్రధాన కార్యాలయానికి వైద్యాధికారి సరెండర్

మహిళా సిబ్బందిపై లైంగిక వేధింపులు, మద్యపానంపై ప్రాథమిక చర్యలు

కొల్లూరు : విధి నిర్వహణలో మద్యం తాగడంతో పాటు మహిళా సిబ్బందిని లైంగికంగా వేధించిన వైద్యాధికారిపై ఆ శాఖాధికారులు ప్రాథమిక చర్యలు చేపట్టారు. కొల్లూరు పీహెచ్‌సీ వైద్యురాలు కావ్యతేజ శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొల్లూరు పీహెచ్‌సీలో గత కొన్నేళ్లుగా వైద్యాధికారిగా పని చేస్తున్న దావులూరి రవిబాబు విధుల్ని గాలికి వదిలి అక్కడే మద్యం తాగుతూ గడుపుతున్నాడు. గదిలోకి వచ్చి తనతో గడపాలని మహిళా సిబ్బందిపై ఒత్తిడి తీసుకురావడంతో పాటు వారి సెల్‌ఫోన్లకు అసభ్యకరమైన సందేశాలు పంపుతూ వేధింపులతో పాటు బెదిరింపులకు దిగుతున్నాడు. అతని ఆగడాలపై వైద్య సిబ్బంది చేసిన ఫిర్యాదుకు తోడు, వైద్యాధికారి వ్యవహారం బయటకు పొక్కింది. చిలికి చిలికి గాలివానలా మారడంతో రాజకీయ నాయకులు అతనిపై చర్యలకు పట్టుపట్టారు. ఈనేపథ్యంలో గత నెల 24న జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారులు నియమించిన కమిటీ విచారణ చేసింది. వైద్య, ఆరోగ్య సిబ్బంది తాము ఎదుర్కొన్న లైంగిక వేధింపులుపై ఆధారాలను విచారణాధికారులకు అందజేశారు. రవిబాబు కూడా మద్యం మత్తులో, మానసిక ఒత్తిడికి లోనై ఆ విధంగా వ్యవహరించానని విచారణాధికారులకు వివరణ ఇచ్చాడు. విచారణాధికారులు సమర్పించిన నివేదికను పరిశీలించిన జిల్లా వైద్యశాఖాధికారులు రవిబాబుపై ప్రాథమిక చర్యలలో భాగంగా డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలోని పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌కు సరెండర్ చేశారు.

క్లుప్తంగా

రేపటి నుంచి జువ్వలపాలెం ఇసుక రీచ్ ప్రారంభం



రేపల్లె రూరల్: ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు సోమవారం నుంచి రేపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని కొల్లూరు మండలం జువ్వలపాలెం ఇసుక రీచ్ ప్రారంభిస్తున్నట్లు ఆర్డీవో హెలా షారోన్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో శనివారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. సాధారణ రుసుంతో ఇసుకను వినియోగదారులకు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్నారు. ప్రతి రోజు ఉదయం 6 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మాత్రమే ఇసుక రీచ్‌లో తవ్వకాలు, రవాణా జరపాలని స్పష్టం చేశారు. ఆ తర్వాత నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇసుక కావాల్సిన వారు జువ్వలపాలెం రీచ్‌కు ఆధార్ కార్డుతో రావాలని సూచించారు. ఒక్కొక్క వ్యక్తికీ రోజుకు 20 టన్నులు అందించాలని ప్రభుత్వం నిర్ణయించిందని వెల్లడించారు. ఇసుక పొందేవారు చెల్లించే నామమాత్రపు రుసుంను ఆన్‌లైన్‌లో స్వీకరిస్తామని తెలిపారు. ఎంత వసూలు చేసేది, ఏ యూపీఏ చెల్లింపులు నిర్వహించాల్సింది త్వరలో ప్రకటించనున్నట్లు ఆమె పేర్కొన్నారు.

రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు కిందపడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శనివారం చీరాల -స్టూవర్టుపురం రైల్వేస్టేషన్ల మధ్య జరిగింది. రెండు స్టేషన్ల మధ్య యూపీ లైన్‌లో వ్యక్తి మృతి చెందాడనే సమాచారంతో సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించినట్లు జీఆర్పీ ఎస్‌ఐ సీహెచ్. కొండయ్య చెప్పారు. మృతుడి వయసు 50–55 మధ్య ఉంటుందని, మృతదేహం పూర్తిగా ఛిద్రమైపోయిందని తెలిపారు. ఎటువంటి ఆధారాలు లభించలేదని తెలిపారు. రైలు కిందపడి ఆత్మహత్య చేసుకుని ఉంటాడని ఎస్‌ఐ అభిప్రాయపడ్డారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని చీరాల ప్రభుత్వాసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

భార్యను కడతేర్చిన భర్త

దుర్గి: భార్యాభర్తల మధ్య గొడవ ప్రాణాల మీదకు తీసుకొచ్చిన విషాద ఘటన మండలంలోని పోలేపల్లి గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. షేక్ ఖాదర్‌వలి, సిలార్‌బీ (39) దంపతుల మధ్య శుక్రవారం రాత్రి చిన్నపాటి వివాదం జరిగింది. ఆవేశానికి లోనైన భర్త చేతిలోని కర్రతో సిలార్‌బీ తలపై గట్టిగా కొట్టాడు. ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. భర్త మాచర్ల పట్టణంలో ముఠా కూలీ పనిచేస్తున్నాడు. సిలార్‌బీ వ్యవసాయ కూలీ పనులు చేస్తుండేది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగ సంతానం. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రజా సమస్యలపై సమష్టిగా పోరాడదాం

వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు

భట్టిప్రోలు: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు సమష్టిగా ప్రజా సమస్యల పరిష్కారానికి ముందుకు సాగుదామని పార్టీ వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. శనివారం అమృతలూరు మండలం కూచిపూడిలోని పార్టీ కార్యాలయంలో భట్టిప్రోలు పట్టణ నాయకులు, కార్యకర్తలు, పంచాయతీ వార్డు సభ్యులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అశోక్‌బాబు మాట్లాడుతూ అధికారం ఉన్నా లేకున్నా ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పని చేయాలని సూచించారు. ఎవరికి ఏ సమస్య వచ్చినా అందుబాటులో ఉంటానని తెలిపారు.



భట్టిప్రోలులో నాయకులు, కార్యకర్తలతో సమీక్షిస్తున్న వరికూటి అశోక్‌బాబు

పార్టీ కోసం పని చేసిన వారు అధైర్య పడొద్దు.... అందరికీ అండగా ఉంటా..అందరం కలసి కట్టుగా ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాడుదామని అన్నారు. ఓటమి పాలైనంత మాత్రాన కార్యకర్తలు ఎవ్వరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. తాను నిరంతరం ప్రజల మధ్యనే ఉంటానని ఎవరికి ఏ కష్టం వచ్చినా నిలబడతానని స్పష్టం చేశారు. సంక్షేమ పథకాల అమలు, పింఛన్ల పంపిణీలో అర్హులకు అన్యాయం జరిగితే న్యాయ పోరాటం ద్వారా సాధిద్దామన్నారు. సమావేశంలో ఎంపీటీసీ సభ్యురాలు కొతరపు పద్మావతి, పంచాయతీ వార్డు సభ్యులు కసుకుర్తి శ్రీనివాసరావు, పట్టణ అధ్యక్షులు కుందేటి రమేష్, వైఎస్సార్ సీపీ నాయకులు కుక్కల వెంకట్రామయ్య, కుక్కల భూషణరావు, దారా చెన్నయ్య, వేల్పూరి బాల సుబ్రహ్మణ్యం(చిన్నారి), గోలి శ్రీనుబాబు, సిరాజుద్దీన్, తలకొల యలమంద, కంభం ఫకీర్, దాసరి శేషయ్య పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్య పరిరక్షణ

పిడుగురాళ్ల: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటే ప్రజలు అనారోగ్యానికి గురి కాకుండా ఉంటారని పల్నాడు జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ రవి తెలిపారు. పట్టణంలోని మారుతీనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం సందర్శించారు. డయేరియాతో బాధపడుతున్న రోగులను పరామర్శించారు. అనంతరం వైద్యులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. డీఎంహెచ్‌వో డాక్టర్ రవి మాట్లాడుతూ ప్రధానంగా ప్రజలు నివసిస్తున్న ప్రాంతాలలో ఆరోగ్యకరమైన వాతావరణం ఉండాలన్నారు. ముఖ్యంగా నీటి నిల్వలు ఉండకుండా చూసుకోవాలని, డ్రైనేజీ నీరు పారుదల అయ్యేలా చూడాలని సూచించారు. ప్రస్తుతం మారుతీనగర్, లెనిన్‌నగర్ ప్రాంతాల్లో డయేరియా బాధితులకు ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి సేవలు అందిస్తున్నామని తెలిపారు. డయేరియా సోకకుండా ప్రజలు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. డయేరియాతో ప్రభుత్వ ఉద్యోగి చికిత్స పొందుతూ మృతి చెందాడని విలేకరులు అడిగిన ప్రశ్నకు సమాధానం చెప్పారు. ఈ ప్రాంతంలో డయేరియా ఉన్న వారికి వైద్య సేవలు అందిస్తున్నామని, మృతి చెందిన ఉపాధ్యాయునికి ఇతర ఆరోగ్య సమస్యలు కూడా ఉన్నాయని ఆయన తెలిపారు. కార్యక్రమంలో మారుతీనగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రవితేజ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రవి

కుటుంబ సభ్యులకు అనిల్ మృతదేహం అప్పగింత

పెనుగంచిప్రోలు: మండల కేంద్రం పెనుగంచిప్రోలు మునేరు కాజ్‌వే కింద శుక్రవారం అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన బాపట్ల జిల్లా చినగంజాం మండలంలోని కడవకుదురు గ్రామానికి చెందిన కంపిరి అనిల్ నాయుడు మృతదేహాన్ని శనివారం పోస్టుమార్టం అనంతరం పోలీసులు ఆయన కుటుంబసభ్యులకు అప్పగించారు. తమ కుమారుడు హోటల్ మేనేజ్‌మెంట్ చేసి ప్రస్తుతం ఖాళీగా ఉంటున్నాడని, ఈనెల 4న హైదరాబాద్ వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడని అనిల్‌కుమార్ కుటుంబసభ్యులు తెలిపారు. అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడని సోషల్ మీడియాలో చూసి వచ్చామని, తమ కుమారుడిని గుర్తుతెలియని వ్యక్తులు కొట్టి చంపారని మృతుడి తండ్రి సురేష్‌కుమార్ పెనుగంచిప్రోలు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. జగ్గయ్యపేట సీఐ జానకీరాం ఆధ్వర్యంలో సర్కిల్ ఎస్‌ఐలు నాలుగు బృందాలుగా ఏర్పడి నిందితుల్ని పట్టుకునేందుకు దర్యాప్తు చేపట్టారు.

ఇసుక రీచ్‌లు పరిశీలించిన అధికారులు

తాడికొండ: ఉచిత ఇసుక విధానం అమలు చేసేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో రీచ్‌ల వద్ద ఏర్పాట్లను పరిశీలించాలన్న జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం తుళ్లూరు మండలంలో రెవెన్యూ, పోలీసు, సెబ్ అధికారులు రీచ్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా లింగాయపాలెం, తాళ్లాయపాలెం, రాయపూడి గ్రామాల్లోని రీచ్‌లను పరిశీలించిన అధికారులు ఉచిత ఇసుక విధానం కోసం డంపింగ్, లోడింగ్, స్టాక్ పాయింట్, సీసీ కెమేరాల ఏర్పాటు పలు అంశాలను పరిశీలించి నివేదిక రూపొందించారు. ఈ నివేదికను జిల్లా అధికారులకు పంపించనున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో తుళ్లూరు తహసీల్దార్ సుధీర్ బాబు, సీఐ-2 అనురాధ, ఎస్‌ఈబీ సీఐ ప్రసన్న, సిబ్బంది పాల్గొన్నారు.

హత్య కేసులో నిందితుడి అరెస్టు

మాచర్ల రూరల్: తన భార్యతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్న స్నేహితుడిని గొడ్డలితో నరికి చంపిన సంఘటనలో నిందితుడిని అరెస్టు చేసినట్లు గురజాల డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. రూరల్ సర్కిల్ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. వెల్దుర్తి మండలం మిట్టమీదిపల్లెలో మృతుడు పులి వెంకటరెడ్డి అదే గ్రామానికి చెందిన జింకల పోలిరెడ్డి స్నేహితులు. భార్య చనిపోవడంతో పోలిరెడ్డి దాచేపల్లికి చెందిన ఓ మహిళను గ్రామానికి తీసుకొచ్చి సహజీవనం చేస్తున్నాడు. పోలిరెడ్డి భార్యతో వెంకటరెడ్డికి సాన్నిహిత్యం ఏర్పడింది. ఓ రోజు ఆమెతో వెంకటరెడ్డి కలసి ఉండడం చూసిన పోలిరెడ్డి గొడవపడ్డాడు. ఆ తరువాత పోలిరెడ్డి భార్య ఇంటి నుంచి వెళ్లిపోయింది. వెంకటరెడ్డి, పోలిరెడ్డి కొన్ని రోజులు మాట్లాడుకోలేదు. ఈ నేపథ్యంలో పోలిరెడ్డి కిడ్నీ సంబంధిత వ్యాధితో వైద్యశాలలో చేరాడు. వైద్యానికి అవసరమైన రూ.3లక్షలను స్నేహితుడైన వెంకటరెడ్డికి ఇచ్చి ఖర్చు పెట్టమని చెప్పాడు. వెంకటరెడ్డి సరైన లెక్కలు చెప్పకపోవటంతో ఇద్దరి మధ్యా మళ్లీ విభేదాలు తలెత్తాయి. ఇవన్నీ మనసులో పెట్టుకున్న పోలిరెడ్డి స్నేహితుడైన వెంకటరెడ్డిని మద్యం తాగుదాం రమ్మని ఈ నెల 4వ తేదీన గ్రామ శివారులోకి తీసుకెళ్లాడు. అతని దగ్గర ఉన్న గొడ్డలితో వెంకటరెడ్డి మెడపై నరికి హత్య చేశాడు. అప్పటి నుంచి నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. శిరిగిరిపాడు చెక్‌పోస్టు వద్ద మధ్యవర్తుల సమక్షంలో నిందితుడిని అరెస్టు చేసి గొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. హత్య జరిగిన కొద్ది రోజులకే రూరల్ సీఐ కె సురేష్ నేతృత్వంలో నిందితుడిని పట్టుకున్న ఎస్‌ఐలు రాజశేఖర్, సత్యనారాయణ, పట్టాభిరామయ్య బృందాన్ని జిల్లా ఎస్పీ మలికా గార్గ్ ప్రత్యేకంగా అభినందించారు.



మాట్లాడుతున్న డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు

పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరం

పల్నాడు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ నోడల్ అధికారి సురేష్

శావల్యాపురం: పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరమని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయ నోడల్ అధికారి నందిగం సురేష్ అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా మండలంలోని శావల్యాపురం, వేల్పూరు గ్రామాల్లోని జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో 7,8,9 తరగతుల విద్యార్థులకు 'సిగిరెట్ వద్దు..పోషకాహారం ముద్దు' అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సురేష్ మాట్లాడుతూ ప్రాథమిక దశ నుంచి విద్యార్థుల్లో పొగాకు ఉత్పత్తులు సిగిరెట్ తాగటం, గుట్కా తదితర వాటిపై అవగాహన పెంపొందించటం ద్వారా భవిష్యత్‌లో చెడు వ్యసనాలకు దూరంగా ఉంటారన్నారు. గుట్కా, ఖైనీ తినే వారంతా నోటి క్యాన్సర్ బారిన పడతాయన్నారు. పొగాకు ఉత్పత్తులపై విద్యార్థులు అవగాహన కల్గి ఉండడం ద్వారా తమ తల్లిదండ్రులు ఇలాంటి చెడు వ్యసనాలకు బారిన పడకుండా ఉంటారన్నారు. అనంతరం పొగాకుకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేశారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులు ప్రసన్న (9వ తరగతి), వెన్నల (8వ తరగతి) నాగ అఖిల్ (9వ తరగతి)లకు ప్రశంసాపత్రాలతోపాటు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బొడ్డుపాటి విజయలక్ష్మి, మండల ప్రాథమిక ఆరోగ్య వైద్యాధికారి రావిపూడి రమ్య, ఆరోగ్య సూపర్‌వైజర్లు అలవలపాటి ఏడుకొండలు, ఉమాదేవి, ఆరోగ్య కార్యకర్త ఇంకొల్లు నాగలక్ష్మి, ఉపాధ్యాయులు బెజవాడ నాగేశ్వరరావు, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమెంటోలు అందజేస్తున్న అధికారులు

ముగిసిన క్యాన్సర్ స్క్రీనింగ్ శిక్షణ కార్యక్రమం

సత్తెనపల్లి: పట్టణంలోని ఏరియా వైద్యశాలలో నెల రోజులుగా నిర్వహిస్తున్న క్యాన్సర్ గుర్తింపు శిక్షణ కార్యక్రమం శనివారంతో ముగిసింది. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు, ఆర్ఎంఓ శోభారాణి ఆధ్వర్యంలో ఎంఓస్, ఏఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ ఇచ్చారు. వైద్యాధికారులు సుజాత, ఇమాంబి, నజీర్, అనూషాలు ట్రైనర్లుగా వ్యవహరించారు. కార్యక్రమంలో అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యులు ధర్మసింగ్ శాస్త్రి, భానుప్రకాష్, ఆసియాలు పాల్గొన్నారు. ట్రైనింగ్ ప్రోగ్రాంలో భాగంగా మూడు రోజులు చొప్పున ఆరు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారు. ట్రైనర్స్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధిని ముందస్తుగా గుర్తించటం ద్వారా నయం చేయటానికి ఎక్కువ అవకాశాలు ఉన్నాయన్నారు. వివిధ భాగాలకు వచ్చే క్యాన్సర్ గురించి వివరించారు. క్యాన్సర్‌ను ఎలా గుర్తించాలి? ఏ లక్షణాల ద్వారా తెలుసుకోవాలనే విషయాన్ని వైద్య సిబ్బందికి వివరంగా తెలియజేశారు. ముగింపు సందర్భంగా వైద్యులు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది పట్టణంలో ర్యాలీ చేపట్టారు. సుమారు వెయ్యి మంది వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



పట్టణంలో ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

రూ.3.96 లక్షల విత్తనాలు, ఎరువులు అమ్మకాలు నిలుపుదల

సత్తెనపల్లి: పట్టణంలోని పలు విత్తన, ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో వ్యవసాయ శాఖ అధికారులు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. రూ.3.96లక్షల విలువైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల అమ్మకాలను నిలిపివేశారు. కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ నుంచి ఏడీఏ బి .వెంకటేశ్వరరావు, విజిలెన్స్ ఎస్ఐ రవికుమార్, సత్తెనపల్లి ఇన్‌చార్జి వ్యవసాయ సహాయ సంచాలకులు ఎస్.శ్రీధర్‌రెడ్డి, లైజనింగ్ ఆఫీసర్ ఏవో ప్రవీణ్ పట్టణంలోని పలు విత్తన, ఎరువులు, పురుగుమందుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన డీలర్ల వద్ద సరైన కంపెనీ సర్టిఫికెట్ లేనందున రూ.3,69,210 విలువైన 4.78 కిలోల మిరప విత్తనాలు, ప్రిన్సిపల్ సర్టిఫికెట్ లేని రూ.19,650 విలువైన 42.25 లీటర్లు పురుగుమందులు, ఫారం ఓ లేని ఎరువులు 22.5 లీటర్లు , రూ.8,100 విలువైన నానో యూరియాను సీజ్ చేశారు. మొత్తం రూ.3,96,960 విలువ కలిగిన విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల అమ్మకాలు నిలుపుదల చేశారు. నాణ్యమైన విత్తనాలు రైతులకు అందించాలనే ఉద్దేశంతో ఆకస్మిక తనిఖీలు చేపట్టినట్లు వెల్లడించారు. నాణ్యత లోపించిన వ్యవసాయ వనరులను రైతులకు అమ్మ చూపితే కఠినమైన చర్యలు తీసుకుంటామని విత్తన, ఎరువులు, పురుగుమందుల డీలర్లను హెచ్చరించారు.



పట్టణంలోని ఎరువుల దుకాణంలో తనిఖీలు చేస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

రైళ్లలో పోగొట్టుకున్న 12 సెల్‌ఫోన్లు అప్పగింత

లక్ష్మీపురం: సౌత్ సెంట్రల్ రైల్వే గుంటూరు డివిజన్ పరిధిలోని రైళ్లలో ప్రయాణించినవారు పోగొట్టుకున్న 12 సెల్‌ఫోన్లను జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వర్లు తిరిగి వారికి అప్పగించారు. జీఆర్పీ సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ ఎస్ఆర్పీ పర్యవేక్షణలో విజయవాడ డీఎస్పీ బి.వి.నాగేశ్వరరావు ఆధ్వర్యంలో గతంలో కొందరు ప్రయాణికులు సెల్‌ఫోన్‌లు పోయిన వైనంపై ఫిర్యాదులు ఇచ్చినట్లు చెప్పారు. దీంతో సీఈఐఆర్ సైట్ ద్వారా సాంకేతిక పరిజ్ఞానంతో కనిపెట్టి 12 మందికి సెల్‌ఫోన్స్‌ను అప్పగించినట్లు తెలిపారు. వాటి విలువ సుమారు రూ.3లక్షలకు పైగా ఉంటుందన్నారు. సెల్‌ఫోన్‌లను రికవరీ చేసిన రైల్వే పోలీసులకు ప్రయాణికులు కృతజ్ఞతలు తెలిపారు.



ప్రయాణికులకు సెల్‌ఫోన్‌లను అందజేస్తున్న జీఆర్పీ సీఐ గంగా వెంకటేశ్వరులు, ఎస్‌ఐలు

కుప్పకూలిన చిత్తూరు

- 92 పరుగులకే ఆలౌట్
- ఆధిక్యం దిశగా విశాఖ జట్టు

మంగళగిరి: విశాఖపట్నం జట్టు బౌలర్‌లు విజృంభించడంతో చిత్తూరు జట్టు కుప్పకూలింది. మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని నవులూరు అమరావతి టౌన్‌షిప్‌లోని ఏసీఏ అంతర్జాతీయ క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఏసీఏ అండర్ –16 మెన్ ఇంటర్ జోనల్ క్రికెట్ పోటీలలో శనివారం విశాఖపట్నం, చిత్తూరు జట్ల మధ్య మ్యాచ్ నిర్వహించారు. తొలుత టాస్ గెలిచి ఫీల్డింగ్ ఎంచుకున్న విశాఖపట్నం జట్టు బౌలర్‌లు విజృంభించడంతో చిత్తూరు జట్టు 35.5 ఓవర్లలో 92 పరుగులకే కుప్పకూలింది. జట్టు బ్యాట్స్‌మేన్ నవధీర్ 1 సిక్స్, 6 ఫోర్లతో 46 పరుగులతో రాణించగా మిగిలిన బ్యాట్స్‌మెన్ విఫలమయ్యారు. విశాఖ బౌలర్లు కె.గౌతమ్ ఆర్య 9 ఓవర్లలో 4 రన్స్ మాత్రమే ఇచ్చి 4 వికెట్లు తీసి రాణించాడు. మరో బౌలర్ శ్యామ్ దినేష్ 3 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన విశాఖజట్టు 52 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 189 పరుగులు సాధించింది. జట్టు బ్యాట్స్‌మేన్ కె.భానుశ్రీ హర్ష 85 పరుగులతో రాణించడంతో విశాఖ జట్టు చిత్తూరుపై ఆధిక్యం సాధించింది. చిత్తూరు జట్టు బౌలర్ ప్రకాష్ ముత్యాల 16 ఓవర్లలో 97 పరుగులు ఇచ్చి 3 వికెట్లు తీశాడు.

